రైతుబంధు అందరికీ ఇవ్వం!

- సచివాలయం, అంబేద్కర్, అమరుల జ్యోతిపై విచారణ
- గతంలో పేరు ఇచ్చినా నన్ను బీఏసీకి అనుమతించలేదు
- రైతుల పంట రుణాలను బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది
- మాది వాస్తవ బడ్జెట్.. అందుకే గతంకంటే 23 శాతం తగ్గింది
- నేను మాట్లాడేది తెలంగాణ భాషనే
- మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా (రైతుబంధు) పథకం కింద అందరికీ పెట్టుబడి సాయం ఇవ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వ్యవసాయం చేసే రైతులకే ఈ పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు. అప్పుడే ఆ పథకానికి అర్థం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ రహదారుల కింద భూములు పోయినవారికి, కాలనీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గుట్టలు, సాగు చేయని భూములకు రైతుబంధు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే పథకం ఉద్దేశం అది కాదని స్పష్టంచేశారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. 'మండలికి సీఎం క్షమాపణ చెప్పే అంశంలో అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు వచ్చాయి. ఆ విషయాన్ని ఆయన చూస్తారు. నేను మాట్లాడేది తెలంగాణ భాషనే' అని పేర్కొన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వచ్చే అంశం తన దృష్టిలో లేదని, ఎవరైనా వచ్చేందుకు సిద్ధంగా ఉంటే పార్టీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకానికి రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టులకు 6 గ్యారెంటీలను అమలు చేయడానికి రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. రేషన్ కార్డులు ఇవ్వడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

మేడిగడ్డ సందర్శనకు ఏ తేదీ అయినా సరే

సభలో నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం ప్రవేశపెడుతామని సీఎం తెలిపారు. మేడిగడ్డపై జ్యుడీషియల్ విచారణ తర్వాత అన్ని నిజానిజాలు బయటికి వస్తాయని అన్నారు. మేడిగడ్డ సందర్శనకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను ఆహ్వానిస్తున్నామని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆ పనిలోనే ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ నేతలకు మేడిగడ్డకు వెళ్లేందుకు 13న వీలుకాకపోతే మరో తేదీ అడుగుతారా? ఏం చేస్తారు అనేది వాళ్లనే అడిగి నిర్ణయిస్తామని తెలిపారు. మేడిగడ్డకు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నామని, ఎవరు వస్తారన్నది బీఆర్ఎస్ ఇష్టమని పేర్కొన్నారు. 'నీటిపారుదల ప్రాజెక్టులను మూడు భాగాలుగా విభజిస్తాం. ఆరు నెలల్లో పూర్తి అయ్యేవి, మూడు సంవత్సరాల్లో పూర్తి అయ్యేవి, అనవసరంగా చేపట్టిన ప్రాజెక్టులు. అందుకు అనుగుణంగా పనులు చేస్తాం. నిధులు కూడా ఆ విధంగానే కేటాయిస్తాం' అని వివరించారు.

మాది వాస్తవాల బడ్జెట్

అసెంబ్లీలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టినది వాస్తవాల బడ్జెట్ అని, గతంలో అబద్ధాలతో బడ్జెట్ పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో తెలంగాణ అంటేనే అబద్ధాలు అనే పర్యాయపదం తెచ్చారని విమర్శించారు. తెలంగాణ అంటే నిజమనే అభిప్రాయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మళ్లీ తెచ్చారని అన్నారు. 60 రోజుల్లో బడ్జెట్ అంచనాలు భట్టికి వచ్చాయని, పదేండ్లు అయినా బీఆర్ఎస్‌వాళ్లకు రాలేదని విమర్శించారు. గత బడ్జెట్ కంటే ప్రస్తుతం రూ.70 వేల కోట్లు తగ్గిందని, అంటే 23 శాతం బడ్జెట్ తగ్గిందని వివరించారు. నీటిపారుదలశాఖలో అప్పులకు వడ్డీలే రూ.16 వేల కోట్లు కట్టాల్సి వస్తున్నదని, గతంలో చేసిన అప్పులకు తమ ప్రభుత్వం ఊరి వేసుకోవాల్సి వస్తున్నదని అన్నారు. రుణమాఫీపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, దీని కోసం బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. రైతులందరి రుణాన్ని ప్రభుత్వం తీసుకొని వారికి రుణం లేకుండా చేస్తామని, ఆ రుణాలను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వంలో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

నాడు బీఏసీకి నన్ను కూడా రానివ్వలేదు

అసెంబ్లీ బీఏసీ సమావేశానికి పార్టీ పేరు ఇచ్చిన వారే రావాలనే నిబంధన ఉన్నదని సీఎం తెలిపారు. గతంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బీఏసీకి తన పేరు, ఎర్రబెల్లి పేరు ఇచ్చినా తనను సమావేశం నుంచి బయటికి పంపించారని చెప్పారు. అప్పుడు హరీశ్‌రావు మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు అభివృద్ధి కోసం వస్తే కలుస్తామని చెప్పారు. తనను కలిస్తేనే బీఆర్ఎస్ పార్టీ వారి ఎమ్మెల్యేలను అనుమానిస్తున్నదని ఎద్దేవా చేశారు. పది పైసలతో అయ్యేది పది రూపాయలు ఖర్చుపెడితే అద్భుతం అవుతుందా? అని ప్రశ్నించారు. సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల జ్యోతి నిర్మాణం, చెల్లింపులు, అంచనా వ్యయంపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు.

ఆర్టీసీ బలోపేతానికే మహాలక్ష్మి పథకం

- ఉద్యమంలో కార్మికుల పాత్ర కీలకం
- అందుబాటులోకి 100 కొత్త బస్సులు
- 90 ఎక్స్‌ప్రెస్, 10 ఏసీ బస్సులు
- లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జెండా ఊపి ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు భట్టి, సీతక్క, కోమటిరెడ్డి, పొన్నం, శ్రీధర్‌బాబు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ప్రభుత్వం మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని తీసుకొచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం 100 కొత్త ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి సీఎం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఈ 100 బస్సుల్లో 90 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయని, శ్రీశైలం నడిపేందుకు 10 ఏసీ రాజధాని బస్సులను తొలిసారిగా సంస్థ ప్రవేశపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందికి పెండింగ్ బకాయిలను పరిష్కరించేందుకు రూ.280 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. మహాలక్ష్మి పథకం కింద 60 రోజుల్లో 15.21 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణానికి చెందిన రూ.535 కోట్ల చెక్కును మహిళలతో కలిసి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎమ్మెల్యేలతోపాటు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే కొత్త బస్సులకు ఆర్డర్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఘనతగా చెప్పుకుంటున్న మరో కార్యక్రమం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మరోసారి రుజువైంది. శనివారం హైదరాబాద్‌లో సీఎం, మంత్రులు అట్టహాసంగా ప్రారంభించిన 100 బస్సులను బీఆర్ఎస్ హయాంలోనే గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. కొత్తగా 1,500 ఆర్టీసీ బస్సులకు ఆర్డర్లు ఇచ్చి, బడ్జెట్ కేటాయింపులు జరిపి, టెండర్లు పూర్తి చేసుకొని, కొత్త బస్సులను దశలవారీగా ప్రారంభించాలని నాడే ఆర్టీసీ నిర్ణయించింది. బస్సుల నిర్మాణం పూర్తయి, వాటిని ప్రారంభించేందుకు ఆర్టీసీ సిద్ధమైన తరుణంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కొత్త బస్సుల ప్రారంభోత్సవం నిలిచింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్డర్లతో వచ్చిన ఆర్టీసీ బస్సులను ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించింది.

మేడారం జాతరకు 6 వేల ప్రత్యేక బస్సులు: సజ్జనార్

మేడారంలో జరగనున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 18 నుంచి 25 వరకు టీఎస్ఆర్టీసీ 6 వేల ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతుందని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్‌సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6, 6.30 గంటలకు హైదరాబాద్ జేబీఎస్ నుంచి, 7 గంటలకు ఎంజీబీఎస్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. మేడారం నుంచి తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి, 2.30, 3.00 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని, పెద్దలకు రూ.550, చిన్నారులకు రూ.310, సూపర్ లగ్జరీ బస్సుల్లో పెద్దలకు రూ.750, చిన్నారులకు రూ.450, ఏసీ బస్సుల్లో పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 చొప్పున చార్జీలు ఉంటాయని ఎండీ సజ్జనార్ తెలిపారు.

ఇండ్ల కూల్చివేత ఫ్యాషనైంది!

- మధ్యప్రదేశ్ హైకోర్టు అసహనం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన ఓ మహిళ ఇల్లు కూల్చివేతపై విచారణ సందర్భంగా ఆ రాష్ట్ర హైకోర్టు ఇండోర్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. మున్సిపల్ అధికారులు ఆమె ఇంటిని తప్పుగా కూల్చివేశారని పేర్కొన్న న్యాయస్థానం.. సరైన ప్రక్రియ అనుసరించకుండా ఇండ్లు కూల్చివేయడం స్థానిక పాలనా సంస్థలు, అధికారులకు 'ఫ్యాషన్' అయిపోయిందంటూ అసహనం వ్యక్తం చేసింది. బాధిత మహిళకు రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అధికారులు సహజ న్యాయ సూత్రాన్ని పాటించకుండా ఇష్టానుసారం ఇండ్లు కూల్చివేయడం.. సంబంధిత వార్త మీడియాలో వచ్చేలా చేయడం ఫ్యాషన్ అయిపోయిందని జస్టిస్ వివేక్ రుసియా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కూల్చివేత అనేది 'చివరి చర్య'గా ఉండాలని, అది కూడా ఇంటిని క్రమబద్ధీకరించుకొనేందుకు యజమానికి సరైన అవకాశం ఇచ్చిన తర్వాత చేపట్టాలని అభిప్రాయపడింది.

ఇరిగేషన్ ఈఎన్సీ ఎవరు?

- పోటీలో ముగ్గురు సీనియర్లు
- తెరపైకి కాంగ్రెస్ ఎమ్మెల్యే బంధువు
- మురళీధర్ రాజీనామా తర్వాత ఇప్పటికీ ఖాళీగానే పోస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి10 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ ఎవరు? రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు ఇదే చర్చ జోరుగా సాగుతున్నది. కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తిన తర్వాత ఈఎన్సీ మురళీధర్‌ను రాజీనామా చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆయన రాజీనామా తర్వాత శనివారం సాయంత్రం వరకు ప్రభుత్వం ఎవరినీ ఆ స్థానంలో నియమించలేదు. 2013లో ఈఎన్సీగా విరమణ పొందిన మురళీధర్‌ను ఉమ్మడి ప్రభుత్వం ఏడాదిపాటు పొడిగించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయననే కొనసాగించింది.

తెరపైకి కాంగ్రెస్ ఎమ్మెల్యే బంధువు

ప్రస్తుతం ఇరిగేషన్‌శాఖలో అడ్మినిస్ట్రేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్సీ నాగేందర్‌రావు, గజ్వేల్ ఈఎన్సీ హరిరామ్ వంటి సీనియర్లు ఉన్నారు. నాగేందర్‌రావుకు ఇప్పటికే ఇరిగేషన్‌శాఖలో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. మచ్చలేని అధికారిగా పేరు సంపాదించుకున్నారు. అనిల్‌కుమార్‌కు ఫీల్డ్ అనుభవం ఎక్కువ. ఆయన నేతృత్వంలోనే మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణం కొనసాగింది. హరిరామ్‌కు సైతం ప్రాజెక్టుల నిర్మాణంలో అనుభముంది. వీరితో పాటు తాజాగా ఈఎన్సీ రేసులోకి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బంధువు, మంచిర్యాల చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి పేరు వచ్చి చేరింది. ప్రభుత్వం మాత్రం ఈఎన్సీ అనిల్‌కుమార్ వైపు మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. అపారమైన అనుభవం ఉన్నప్పటికీ ఈఎన్సీ నాగేందర్‌రావు వచ్చే మేనెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఏప్రిల్‌లో విరమణ పొందాల్సి ఉంది. మిగిలిన ఇద్దరిలో అనిల్‌కుమార్‌కు మరో 20 నెలలు, హరిరామ్‌కు మూడేళ్ల సర్వీస్ ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనిల్‌కుమార్‌వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.

ఈఎన్సీలందరికీ సమాన బాధ్యతలు

ఇరిగేషన్‌శాఖను గత ప్రభుత్వం 2020లో పునర్వ్యవస్థీకరించి 19 టెరిటోరియళ్లుగా విభజించింది. మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుకు కిందికి తీసుకొచ్చి ఆయా టెరిటోరియల్ బాధ్యతలను చీఫ్ ఇంజినీర్లకే అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీ జనరల్‌కు అప్పగించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలకాలని చూస్తున్నట్టు సమాచారం. ఈఎన్సీ జనరల్‌కు పూర్తిస్థాయి అధికారాలు అప్పగించకుండా ఈఎన్సీలందరికీ సమాన బాధ్యతలు, అధికారాలు పంచాలని చూస్తున్నట్టు తెలిసింది.

సింగరేణి పీఆర్వోకు డాక్టరేట్

సింగరేణి సంస్థ ప్రజా సంబంధాల అధికారి శ్రీరాముల శ్రీకాంత్‌ను అభినందిస్తున్న అధికారి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ ప్రజా సంబంధాల అధికారి శ్రీరాముల శ్రీకాంత్‌కు తెలంగాణ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూవ్‌మెంట్స్ ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూవ్‌మెంట్' అన్న అంశంపై ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధనను పూర్తిచేశారు. మీడియా సంస్థల్లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో శ్రీకాంత్ సేవలందించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ అధికారులు ఆయనను శనివారం అభినందించారు.

బస్ కండక్టర్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో శనివారం ఆర్టీసీ కండక్టర్‌పై ఓ మహిళ దాడికి దిగిన ఘటన చోటుచేసుకున్నది. నగరంలోని శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ప్రసన్న హైదర్‌గూడ వెళ్లేందుకు శివరాంపల్లి వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కింది. స్టేజీ దాటాక అత్తాపూర్‌లో ఆమెను దించారు. మెహదీపట్నం నుంచి ఉప్పల్ వెళ్తున్న 300 నంబర్ బస్సు ఎక్కింది. సుమారు 200 మీటర్ల దూరంలోనే బస్సును దిగేందుకు ఆమె ప్రయత్నించగా, కండక్టర్ ముత్యాల నర్సింహ ఆమెను ఎక్కడ దిగాలంటూ అడిగారు. దీంతో ఆగ్రహానికి లోనైన సదరు మహిళ ఫ్రీగా బస్సులు ఎందుకు నడుపుతున్నారంటూ ఆయనను చెప్పుతో కొట్టింది. దీంతో తోటి ప్రయాణికులు ఆమెను అడ్డుకొని బస్సును రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లారు. స్టేషన్ సమీపంలో బస్సు ఆగగానే ఆమె అక్కడి నుంచి పరారైంది. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐదేండ్ల బాలికపై లైంగిక దాడి

నీలి చిత్రాల ప్రభావంతో దారుణం

గోండా(యూపీ), ఫిబ్రవరి 10: ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకొన్నది. ఐదేండ్ల బాలికపై ఇద్దరు సహ విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితులైన బాలలు 8, 10 ఏండ్ల వాళ్లని, నీలి చిత్రాల ప్రభావంతో తాము ఈ నేరానికి పాల్పడినట్టు వారు ఒప్పుకొన్నారని పోలీసులు శనివారం వెల్లడించారు. గోండా జిల్లా ధనేపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగిందని తెలిపారు.

బడ్జెట్ సాక్షిగా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- ఇచ్చిన హామీలకు, కేటాయింపులకు పొంతనే లేదు
- హామీల అమలుకు రూ.5 లక్షల కోట్లకుపైగా అవసరం
- కేటాయించిన నిధులు రూ.53 వేల కోట్లు మాత్రమే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

మేడిపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

మేడిపల్లి/ మల్యాల, ఫిబ్రవరి 10: రాష్ట్ర బడ్జెట్ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టులో పూజలు చేసిన అనంతరం మేడిపల్లి మండల కేంద్రంలో ఆయన ప్రజాహిత యాత్రకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు మేడిపల్లి మండల కేంద్రం నుంచి కొండాపూర్, రంగాపూర్, భీమారం, మన్నెగూడెం మీదుగా సాగిన యాత్ర.. కథలాపూర్ మండలం బొమ్మెన, తక్కళ్లపల్లి గ్రామాల వరకు చేరుకున్నది. రాత్రి సిరికొండలో బస చేశారు. అంతకుముందు కొండగట్టులో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు రూ.5 లక్షల కోట్లకు పైగా అవసరమని, కానీ ఈ రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఏటా బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్.. రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను దారుణంగా వంచించిందని దుయ్యబట్టారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు సైతం బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ ఇక లేనట్లేనని, కౌలు వ్యవసాయ రైతులకు సాయం గాలికొదిలేశారని వివరించారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు.

పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. మళ్లీ బాబ్రీమసీదు నిర్మాణం

అయోధ్యలో రాముడు పుట్టాడనడానికి ఆధారాలేమిటని కాంగ్రెస్ నేతలు కావాలని వివాదాస్పదం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు వాళ్ల అమ్మ కడుపులో పుట్టారనడానికి ఆధారాలేమిటని ప్రశ్నించారు. అక్కడ ఉన్న డాక్టర్, నర్సు చెప్తేనే కదా వాళ్లకు తెలిసేదని మండిపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొరపాటున గెలిచినా.. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరం స్థానంలో మళ్లీ బాబ్రీ మసీదును నిర్మిస్తుందని హెచ్చరించారు. మోదీని మరోసారి ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రజాహిత యాత్ర చేపట్టానని, రామరాజ్యం కావాలా? రాక్షస రాజ్యం కావాలా? తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆలోచన చేసి ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, ప్రతాప రామకృష్ణ, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో ప్రారంభమైన వర్క్‌షాప్‌లో హైకోర్టు న్యాయమూర్తులు

సైబర్ నేరాలను సమర్థంగా అడ్డుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తుల ఉద్ఘాటన

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలను మరింత సమర్థంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ కే లక్ష్మణ్ ఉద్ఘాటించారు. సైబర్ నేరాలపై చర్చించేందుకు హైదరాబాద్ తగిన ప్రదేశమని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాలపై శనివారం రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో ప్రారంభమైన వర్క్‌షాప్‌లో వారు మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నందున సైబర్ నేరాలపై వారిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. అవినీతిని నిరోధించేందుకు ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో జరగాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ నిర్మల్ కుమార్, జస్టిస్ శక్తివేల్, జస్టిస్ అనూప్ చిట్కారా, జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ స్వర్ణకాంతశర్మతోపాటు జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ మంగరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో జరుగుతున్న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ ఏడో మహాసభల్లో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత్రి ఓల్గా

'ట్రోలింగ్' సమాజానికి ప్రమాదకరం

- ఈ విపరీత ధోరణికి బలయ్యేది మహిళలే
- ఎదుర్కోవడానికి మహిళలు సిద్ధంగా ఉండాలి
- ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ మహాసభల్లో వక్తలు

ఖమ్మం, ఫిబ్రవరి 10: ట్రోలింగ్ అనేది సమాజానికి ప్రమాదకరంగా మారిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మహిళలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాలులో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ ఏడో మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన సదస్సులో బీబీసీ తెలుగు ఎడిటర్ రామ్మోహన్‌రావు, ప్రముఖ రచయిత్రి ఓల్గా ఉపన్యసించారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై ట్రోలింగ్ విపరీతంగా జరుగుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనేక పెట్టుబడిదారీ వ్యవస్థలు ఈ ట్రోలింగ్‌ను తమ వ్యాపార సామ్రాజ్య విస్తరణకు ఉపయోగించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. పాలకులు సైతం విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. అనంతరం పలువురు వక్తలు వివిధ అంశాలపై ఉపన్యసించారు. ఆ తరువాత 'ట్రోల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మహాసభల సమన్వయకర్త రవిమారుత్, పలువురు ప్రముఖ రచయితలు తదితరులు పాల్గొన్నారు.

పులి నకనక.. ఆహారంగా జింక

- కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల ఆకలి కేకలు
- ఆహారం లేక అలమటిస్తున్న వ్యాఘ్రాలు
- ఆకలితో ఆయుర్దాయం తగ్గుదల
- అడవిలో జింకలు వదిలేందుకు సిద్ధమైన అటవీశాఖ
- హైదరాబాద్ జూపార్క్ నుంచి 200 జింకలు తీసుకెళ్లాలని నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఇటీవలి కాలంలో పులులు, సింహాల వంటి క్రూరమృగాలు తరచూ గ్రామాలు, పట్టణాల్లోకి వస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అడవిలో ఆహారం కరువై ఆకలితో అలమటిస్తున్న మృగాలు ఆహార అన్వేషణలో సమీపంలోని గ్రామాల్లోకి చొరబడుతున్న ఘటనలు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లోనూ పులులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. వేటాడేందుకు వన్యప్రాణులు లేక ఆకలితో అలమటిస్తూ ఊర్లపై పడుతున్నాయి. కనిపించిన పశువులను చంపి ఆకలి తీర్చుకుంటున్నాయి. పులల చేతిలో హతమైన పశువుల యజమానులకు పరిహారం అందించడం అటవీశాఖకు తలకుమించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అటవీశాఖ పులులు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకట్ట వేయడంతోపాటు వాటి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జూపార్క్ నుంచి జింకలను తెచ్చి కాగజ్‌నగర్ కారిడార్‌లో వదిలిపెట్టాలని నిర్ణయించింది.

పెరిగిన ఆహార ఖర్చు

పులుల ఆహార ఖర్చు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. 2021-22లో కొన్ని లక్షలుగా ఉన్న ఖర్చు 2023-24లో ఏకంగా రూ. 66 లక్షలు దాటింది. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన పులులతో కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల సంచారం గణనీయంగా పెరిగింది. వీటి ఆకలి తీర్చే జంతువులు అడవిలో లేకపోవడంతో వీలైనంత త్వరగా జింకలను తీసుకొచ్చి వదలాలని అటవీశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జూపార్క్ నుంచి 200, కరీంనగర్ ఎల్ఎండీ డీర్‌పార్క్ నుంచి 50 చుక్కల దుప్పులను తీసుకొచ్చి అడవిలో వదిలి పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మరోవైపు, చుక్కల దుప్పులు, నీల్గాయి, కొండగొర్రె, సాంబార్, అడవి పందుల వంటి శాకాహార జంతువుల సంతతిని పెంచే ప్రయత్నాలు చేస్తూనే వారం రోజుల వ్యవధిలోనే జింకలను అభయారణ్యంలో వదిలేందుకు రెడీ అవుతున్నది.

వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినడం వల్లే

కాగజ్‌నగర్ కారిడార్‌లో ప్రస్తుత పరిస్థితికి వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినడమే కారణమని భావిస్తున్నారు. 2022లో 150 జింకలను పులులకు ఆహారంగా అడవిలో విడిచిపెట్టగా, వాటిలో సగానికిపైగా వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాయి. ఇంకోవైపు, పొలాలకు రక్షణగా కరెంటు తీగల అమర్చడంతో వాటికి తగిలి అడవి పందులు మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా పులులకు ఆహార కొరత ఏర్పడుతున్నది. దీనికితోడు మహారాష్ట్రలోని తడోబా పులల సంరక్షణ కేంద్రం నుంచి కాగజ్‌నగర్ కారిడార్‌లోకి వచ్చిన పులులు 12 కూనలకు జన్మనిచ్చాయి. తాజాగా, వాటిలో రెండు మృత్యువాత పడ్డాయి.

100కుపైగా పశువుల బలి

అధికారిక గణాంకాల ప్రకారం ఒక్క కాగజ్‌నగర్ డివిజన్‌లోనే 100కుపైగా పశువులు పులికి ఆహారమయ్యాయి. ఇందుకుగాను వాటి యజమానులకు అటవీశాఖ రూ. 18 లక్షలు పరిహారంగా అందించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు మరో 10 పశువులపై పులులు దాడిచేయగా వాటికి ఇవ్వాల్సిన పరిహారం పెండింగులో ఉంది. చెన్నూరులో 60 పశువులకు రూ. 8 లక్షలు, బెల్లంపల్లి డివిజన్ పరిధిలో 30కి పైగా పశువులకు రూ. 5 లక్షలు చెల్లించారు. మరో రూ. 10 లక్షలకు పైగా పరిహారం పెండింగులో ఉంది. ఒక్కో పులికి సగటున రోజుకు 40 కేజీల మాంసం అవసరం. ఈ లెక్కన కాగజ్‌నగర్ కారిడార్‌లోని 14 పులులకు 560 కేజీల మాంసం అవసరమవుతుంది. ఈ కారిడార్‌లో ఆహార కొరత వేధిస్తుండడంతో పులుల ఆయుర్దాయం ఐదేండ్లు తగ్గినట్టు గుర్తించారు.

ఆవాసం సరిపోక.. ఆకలి తీరక

ఒక్కో పులి సాధారణంగా దాదాపు 1000 హెక్టార్ల పరిధిలో తన ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. ఈ లెక్కన కాగజ్‌నగర్ కారిడార్ 9 పులులకు మాత్రమే చోటు ఉంది. మిగిలిన పులులు ఆవాసం లేక, ఆహారం దొరకక సమీపంలోని గ్రామాలపై పడుతున్నాయి. ఆవాసం కోసం మూడు పులులు వేమనపల్లి, కుశ్నపల్లి, నెన్నెల, బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతానికి వెళ్లాయి. అక్కడ కూడా ఆహార కొరత వేధిస్తుండడంతో సమీప గ్రామాలపై పడుతున్నాయి. ప్రస్తుతం కాగజ్‌నగర్ కారిడార్‌లోని వాంకిడి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట, దహేగాం, కాగజ్‌నగర్ మండలాల్లో పులుల సంచారం గణనీయంగా ఉండడంతో వాటి ఆకలి తీర్చడంతోపాటు ప్రాణాలు కాపాడేందుకు రక్షణ చర్యలు చేపట్టారు.